క్లుప్తంగా

వ్యవసాయ అధికారిగా హిమబిందు



దుద్యాల్: మండల వ్యవసాయ అధికారిగా హిమబిందు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. వ్యవసాయంపై రైతులకు ఎలాంటి సలహాలు సూచనలు కావాలన్న తనను సంప్రదించొచ్చన్నారు.

యువతలో పోటీతత్వం పెరగాలి

ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి జగదీశ్



క్రికెట్ బంతులను బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: నేటి యువతలో పోటీతత్వం పెరగాలని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి జగదీశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో క్రీడాకారులకు బీజేపీ మండల నాయకులు 12 టెన్నిస్ బంతులు ప్రదానం చేశారు. ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జనార్దన్, అనిల్, డి.మహేశ్, కటికె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పరిరక్షణకు కృషి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుల్కచర్ల: దళిత హక్కుల పరిరక్షణకు ఎమ్మార్పీఎస్ నిర్విరామంగా కృషిచేస్తుందని కుల్కచర్ల మండల దళిత యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్ము శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... వెనుకబాటుకు గురవుతున్న దళిత ప్రజల హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణ పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బైండ్ల బాలకృష్ణారావు, చుక్కయ్య, ఎల్లయ్య, నాగని వెంకట్రాములు, బైండ్ల రాంచందర్, కామునిపల్లి వెంకటయ్య, బిచ్చయ్య, బాబయ్య, జె.వెంకటయ్య, నర్సింలు, పాపయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, పోతగళ్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎస్‌ఐ సంతోష్‌కుమార్



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తదితరులు

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడంతో ముందు తరాలకు క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఆటలు ఆడటం వల్ల ప్రాంతాల మధ్య సత్సంబంధాలు పెరిగి స్నేహభావం పెరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీలో పని చేస్తున్న రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కృషి చేస్తోందని సీసీఐ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సునీల్ సాహూతో వారు చర్చలు జరిపారన్నారు. ఇందులో రైల్వే కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి రెండు సంవత్సరాల బోనస్ విడుదల చేయడానికి యాజమాన్యం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్మికులు ఐక్యమత్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చని శరణప్ప గుర్తు చేశారు. లేబర్ కమిషనర్‌ను కలిసిన వారిలో బాలరాజు, దస్తప్ప, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

కందికి భలే డిమాండ్..!

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో పెరిగిన క్రయవిక్రయాలు

- భౌగోళిక గుర్తింపుతో పెరిగిన వినియోగం
- క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,400, సగటు ధర రూ.7,875
- ఊపందుకున్న కొనుగోళ్లు



మార్కెట్లో రైతుల సందడి



తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు

తాండూరు: సీజన్ ఆరంభంలోనే ప్రభుత్వ మద్దతు ధరకు మించి ధర పలుకుతోంది. తాండూరు కంది పప్పుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ప్రకటించింది. దీనికి సహజ గుణమైన రుచితో పాటు పోషక విలువలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. దీంతో ఈ పప్పు వినియోగం పెరిగింది. ఇక్కడి కందులకు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశ విదేశాల్లో కూడా భలే డిమాండ్ ఉంది. తాండూరులో పండించే కందులకు రాష్ట్రంలో ఉన్న అన్ని వ్యవసాయ మార్కెట్ల కంటే తాండూరు మార్కెట్‌లో అధిక ధర పలుకుతోంది. జిల్లాలో ప్రస్తుతం కందుల కొనుగోళ్లు జోరందుకుంది. సీజన్ తొలినాళ్లలో కురిసిన వర్షాలకు పంట దిగుబడులపై ప్రభావం పడినప్పటికీ కంది ఆశాజనకంగా ఉండటంతో రైతులకు కలిసొచ్చింది.

మండలాల్లో ఇలా..

వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో కందిని విస్తృతంగా సాగు చేశారు. కంది పంట సాగును అధికంగా తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో రైతులు సాగు చేస్తారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 1.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో కంది పంట వేశారు. పంట విస్తీర్ణం ప్రకారం జిల్లాలో 9 లక్షల క్వింటాళ్ల కంది మార్కెట్‌కు రానుంది. జూన్‌లో వేసిన పంటకు డిసెంబర్, జనవరి నెలలో దిగుబడులు వస్తాయి. వర్షాలు అధికంగా కురిసినందునా కొంత వరకు కంది పంటకు నష్టం వాటిల్లింది.

తాండూరు మార్కెట్‌లో..

గతంలో కందులకు జాతీయ స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550 ప్రకటించింది. ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కందులకు మద్దతు ధర కంటే తక్కువ ధరకు మార్కెట్ యార్డులో కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో మాత్రం ప్రభుత్వ మద్దతు ధరకు మించి కంది కొనుగోళ్లు చేస్తున్నారు. గురువారం తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన బిడ్డింగ్‌లో క్వింటాల్ కందులకు గరిష్ఠ ధర రూ. రూ.8,400, కనీస ధర రూ.6,225, సగటు ధర రూ.7,875 ధర చొప్పున పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.400 నుంచి 900 వరకు అధికంగా ఆదాయం చేకూరుతుంది.

కంది రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తాం



తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతున్నాయి. రైతులకు మేలు చేకూర్చే విధంగా, ఆర్థిక భరోసానిచ్చేవిధంగా మార్కెట్ కమిటీ కృషి చేస్తోంది. గ్రామాల నుంచి మార్కెట్ యార్డుకు కందులు తీసుకొచ్చిన రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళతాం.

బాల్‌రెడ్డి, చైర్మన్, మార్కెట్ కమిటీ, తాండూరు

రూ.27.56 కోట్ల వ్యాపారం

తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది పంట గతేడాది నవంబర్ 22వ తేదీ నుంచి తాండూరు మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నవంబర్ 22వ తేదీ నుంచి ఇప్పటి వరకు 35,200 క్వింటాళ్ల కొనుగోలు జరిగాయి. దీంతో కందుల కొనుగోళ్లతో రూ.27.56 కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్ కమిటీ పరిధిలో దాదాపు 79 కమీషన్ ఏజెంట్ల ద్వారా ఇప్పటి వరకు 35,200 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశారు. జనవరి నెలలో సీజన్ మరింత ఊపందుకోనుంది. మూడు నెలల పాటు కందుల వ్యాపారం కొనసాగనుంది.

జీఐ ట్యాగ్‌తో..

తాండూరు కందిపప్పునకు కేంద్ర ప్రభుత్వం తాండూరు దాల్‌గా జీఐ ట్యాగ్ (భౌగోళిక గుర్తింపు) నిచ్చింది. మార్కెట్‌లోకి కొత్త కంది పప్పు రావడంతో నెల రోజులుగా ధరలు దిగి వస్తున్నాయి. నెల రోజుల క్రితం క్వింటాల్ కందికి రూ.18 వేలకు పైగా ధర పలికింది. తాజాగా తాండూరు మార్కెట్‌లో కంది పప్పు క్వింటాల్‌కు రూ.13,500గా ఉంది. రెండేళ్ల తర్వాత తక్కువ ధరకు ఈ సీజన్‌లో కంది పప్పు అందుబాటులోకి వచ్చింది.

‘వర్గీకరణ’కు మద్దతునిద్దాం



కొత్తూరులో వర్గీకరణ కోసం చైతన్యం కల్పిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరులో గురువారం ఎస్సీ వర్గీకరణ కోసం అవగాహన నిర్వహించారు. కేఎస్‌పీఎస్, అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో డప్పులతో దరువేస్తూ చైతన్యం చేశారు. ప్రజాస్వామ్య వాదులంతా మాదిగలు, మాలలతోపాటు ఉపకులాల వారిగా కోరుతున్న ఏబీసీడీ వర్గీకరణకు మద్దతునివ్వాలన్నారు. ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘లక్ష డప్పులు వేల గొంతులు’ మహాసభ సమ్మేళనానికి తరలిరావాలన్నారు. కేఎస్‌పీఎస్ మండలాధ్యక్షుడు అంజిలప్ప, ప్రధాన కార్యదర్శి అంజి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మాల చిన్నయ్య, కళాకారుల సంఘం అధ్యక్షుడు బాలు, కళాకారులు శ్రీను, సుందర్‌రాజ్, నర్సయ్య, కిష్టప్ప, భీమయ్య, మాల ఎల్లయ్య, నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే ప్రారంభం



కొడంగల్: సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్, కమిషనర్ బలరాం నాయక్

తాండూరు రూరల్: తాండూరు పట్టణం, రూరల్ కలిపి 2,738 రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ అన్నారు. మున్సిపాల్టీలో వార్డు ఆఫీసర్, రెవెన్యూ సిబ్బందితో కలిపి 6 టీంలు, గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో కలిపి 5 టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు సర్వేను పూర్తి చేస్తామన్నారు. కోత్లాపూర్‌లో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి నూతన రేషన్‌కార్డులకు సంబంధించి సర్వే చేస్తున్నారన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండలంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సంబంధించి రెవెన్యూ అధికారులు గురువారం సర్వే ప్రారంభించారు. గతంలో మీ సేవా ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను విచారిస్తున్నారు. దుద్యాల్, హస్నాబాద్, కుదురుమల్ల, ఈర్లపల్లి, హకీంపేట్, పోలెపల్లి, చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, లగచర్ల తదితర గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. త్వరలో సర్వే పూర్తి చేస్తామని తహసీల్దార్ కిషన్ తెలిపారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని జూనియర్ అసిస్టెంట్ పావని పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో రేషన్‌కార్డుల సర్వే నిర్వహించారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి జిన్నారం, అన్నాసాగర్ తదితర గ్రామాలను సందర్శించి సర్వే నిర్వహించారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహించే సర్వేను పారదర్శకంగా చేయాలని తహశీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు.

దోమలో..

దోమ: నూతన రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందికి ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు.



తాండూరు రూరల్: కోత్లాపూర్‌లో రేషన్‌కార్డుల సర్వేచేస్తున్న సిబ్బంది



దుద్యాల్: హస్నాబాద్‌లో సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది ఫకీరప్ప



బంట్వారం: జిన్నారంలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ డానియల్ తదితరులు

పగిలిన పైపులైన్‌కు మరమ్మతు పనులు



పగిలిన పైపులైన్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో తాగునీరు సరఫరా చేసే పైపులు పగలడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో తాగు నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై గురువారం సాక్షి ‘తప్పని తాగు నీటి కష్టాలు’ అనే కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. సత్వరమే పనులుపూర్తి చేసి తాగునీరు సరఫరా సక్రమంగా చేస్తామని అధికారులు తెలిపారు.

బీజేపీ అధ్యక్షులకు సన్మానం

పరిగి: నియోజకవర్గంలోని ఆయ మండలాల్లో బీ జేపీ నూతన మండల అధ్యక్షులను ఎన్నుకుంది. గురువారం పార్టీ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

అన్నదానానికి వంద వారాలు

కొడంగల్: సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతీ వారం అన్నదానం చేస్తున్నారు. గురువారం నాటికి వంద వారాలు పూర్తి చేశారు. తాండూరు సమితి వికారాబాద్ జిల్లా పర్యవేక్షణలో వంద వారాలుగా నారాయణ సేవ (అన్నదానం) చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జగన్‌సింగ్ ఠాగూర్, యువజన నాయకులు బసవేశ్వర్, డిప్యూటీ డీఎమ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ కంట్రోలర్ పట్లోళ్ల నర్సింహ్మారెడ్డిలు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు అభినందనీయం



క్షీరాభిషేకం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

మర్పల్లి: నిజామాబాద్ జిల్లాలోని ఇందూర్‌లో కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయమని మర్పల్లి కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులతో కలిసి నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందూర్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం బోర్డు చైర్మన్ పల్లే రంగారెడ్డి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహేశ్వరి పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం కసరత్తు

- సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు
- సర్వేపనుల్లో అధికారులు బిజీ



పరిగి: నస్కల్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

దుద్యాల్: రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. అందుకుగాను తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు కసరత్తులు మెదలుపెట్టారు. తహసీల్దార్ కిషన్, వ్యవసాయ అధికారి హిమబిందు గ్రామాల్లో సాగుకు యోగ్యం కానీ భూములు గుర్తించే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తిస్తున్నామన్నారు. ప్లాట్ల విక్రయాల కొరకు సిద్ధం చేసిన వెంచర్లు, వ్యాపారులు నిర్మించుకున్న రైస్‌మిల్లులు, మైనింగ్, వాటర్ ప్లాంట్ల వంటి వివిధ నిర్మాణాలను గుర్తించి వాటి సర్వే నంబర్ ఆధారంగా రికార్డుల్లో నమోదు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని ఓ వ్యక్తి సాగు భూమిని ప్లాట్లుగా మార్చి గ్రామస్తులకు అమ్మడంతో అక్కడ కొనుగోలు దారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ భూమికి కూడా గతంలో రైతుబంధు అందేది. దీంతో అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ భూమికి ప్రస్తుతం అందే రైతు భరోసాను నిలిపివేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఏఈవోలు భావన, మాణిక్య శ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: సాగు యోగ్యం కాని భూముల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. బర్కత్‌పల్లి, నస్కల్, రూప్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూముల వివరాలను సేకరించాలని సూచించారు.

ధారూరులో..

ధారూరు: తహసీల్దార్ సాజిదాబేగం, ఏఓ సూర్యప్రకాశ్, ఏఈఓ సంజూరాథోడ్‌లు ధారూరు సమీప రాఘవేంద్రం రైస్‌మిల్లును పరిశీలించారు. ఈ వ్యవసాయ భూమిలో 2 ఎకరాల్లో రైస్‌మిల్లు నిర్మాణం జరిగినట్లు నిర్ధారించిన అధికారులు దానికి సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించాలని మిల్లు యజమానిని ఆదేశించారు. వీరితో పాటు మండలంలోని అన్నిగ్రామాల్లో అధికారుల బృందాలు సర్వే ప్రారంభించాయి.

యాలాలలో..

యాలాల: కోకట్ క్లస్టర్‌లో ఆర్‌ఐ సాయిచరణ్, ఏఈఓ మదన్‌మోహన్ భూములను పరిశీలించారు. గతంలో వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయించిన భూములు, రాళ్లు, గుట్టలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

బంట్వారంలో..

బంట్వారం: మండలంలోని రాంపూర్ తదితర గ్రామాలను సందర్శించి వ్యవసాయేతర భూములపై కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: దోమ మండల కేంద్రంతో పాటు బాస్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సందర్శించి సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, వ్యవసాయ మండల అధికారి ప్రభాకర్ రావు, ఆర్‌ఐలు సుదర్శన్, ఏఈఓలు చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల రెవెన్యూ అధికారులు రవి, ఖజా, వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిత గ్రామంలోని పలు స్థలాలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మండల పరిధిలో సాగు భూముల వివరాలను అధికారులు సేకరించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ వ్యవసాయాధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఏడీఏ శంకర్ రాథోడ్, ఏఓ పూజ, ఏఈఓ రాజులతో కలిసి గ్రామాలకు వెళ్లి సాగు భూములను పరిశీలించారు.



ధారూరు: రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ సాజిదాబేగం



యాలాల: కోకట్ పరిధిలో వెంచర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఐ సాయిచరణ్, ఏఈఓ మదన్‌మోహన్



కుల్కచర్ల: భూముల సర్వేను నిర్వహిస్తున్న అధికారులు